ఒక్క రామ నామం అనే తాళంచెవే ఈ ప్రపంచమనే బందిఖానా నించి మనల్నందరినీ శాశ్వతంగా బయటపడేసేది. ఎనభై నాలుగు లక్షల రకాల జీవరాశుల్లో తిరిగి తిరిగి జన్మించే కంటే, మళ్ళీ మళ్ళీ పుట్టే దుర్దశ నించి మన ఆత్మని శాశ్వతంగా విడుదల చేసే ఆ తారక మంత్రాన్ని మించిన చక్కటి కానుక మీకు ఇంకోటి ఉండదు." వివరించాడా గార్డు.

## 64. ముగ్గురు వృద్ధులు

ఓ ఇంటావిడకి తన ఇంటి బయటి నించి ఎవరివో మాటలు వినబడ్డాయి.

"ఈ రోజు ఎవరైనా మనకి భోజనం పెడితే బావుండును."

ఆవిడ వెంటనే బయటకి వెళ్ళి చూస్తే చెట్టు కింద, తెల్లటి గడ్డాలు గల ముగ్గురు వృద్ధులు కనిపించారు.

"మీరెవరో నాకు తెలీదు కాని మా ఇంటికి భోజనానికి రండి." ఆహ్వానించింది.

"మీ ఆయన వప్పుకున్నారా?" ప్రశ్నించారు వాళ్ళు.

"ఆయన ఇంట్లో లేరు. ఆఫీసుకి వెళ్ళారు."

"అయితే ఇంటికి వచ్చాక ఆయన అనుమతి తీసుకుని పిలు. మాలో ఎవరో ఒకరే వస్తాం." చెప్పారు.

భర్త ఆఫీసునించి ఇంటికి వచ్చాక ఆవిడ ఆ వృద్ధుల గురించి ఆయనకి చెప్పింది.

"అలాగా! నేను అనుమతి ఎందుకు ఇవ్వననుకున్నారు? వెళ్ళి ఆ ముగ్గుర్నీ భోజనానికి రమ్మన్నానని చెప్పు." ఒప్పుకున్నాడు భర్త.

ఇంటావిడ వంట చేయగానే వెళ్ళి వాళ్ళని భోజనానికి రమ్మని ఆహ్వానించింది.

"మాలో ఒక్కరమే వస్తాం. ఎవరు రావాలో మీ కుటుంబ సభ్యులతో నిర్ణయించుకుని పిలు. నా పేరు ఐశ్వర్యం. నేనెక్కడుంటే అక్కడ ఐశ్వర్యం ఉంటుంది." చెప్పాడు ఒక వృద్ధుడు.

"నా పేరు విజయం. నేనెక్కడుంటే అక్కడ విజయం ఉంటుంది." చెప్పాడు రెండో వృద్ధుడు.

ఆవిడ మూడో ఆయన వంక చూస్తే ఆయన చెప్పాడు.

"నా పేరు ప్రేమ. నేను ఎక్కడ ఉంటే అక్కడ ప్రేమ విలసిల్లుతూంటుంది. మేము ఐశ్వర్యం, విజయం, ప్రేమలకి అధిష్టాన దేవతలం."

ఆవిడ ఇంటికి వెళ్ళి తన కుటుంబ సభ్యులకి ఈ విషయాలన్నీ చెప్పింది.

"అయితే ఐశ్వర్య దేవతని పిలుద్దాం. అప్పుడు మనం తక్షణం ధనవంతులవుతాం." ఆనందంగా చెప్పింది ఆవిడ కూతురు.

"ఒద్దొద్దు. విజయాన్ని పిలుద్దాం. అప్పుడు మనం పట్టిందల్లా బంగారం అవుతుంది." కొడుకు చెప్పాడు.

"మీరేమంటారు?" భర్తని ప్రశ్నించిందావిడ.

"మనిషికి ముఖ్యమైనది ప్రేమ కాబట్టి ప్రేమాధిష్టాన దేవతని ఆహ్వానిద్దాం." సూచించాడాయన.

వెంటనే ఆ ఇంటావిడ వాళ్ళ దగ్గరకి వెళ్ళి ప్రేమకి అధిదేవతని ఆహ్వానించింది. ఆయన నవ్వుతూ లేచి ఆవిడని అనుసరించాడు. ఆయనని ఇంట్లోకి తీసుకెళ్ళి ఆకు వేసి అన్నం వడ్డించేలోగా తలుపు చప్పుడైంది. వెళ్ళి తలుపు తెరచి చూసిన ఆవిడకి ఎదురుగా, మిగిలిన ఇద్దరు అధిష్టాన దేవతలు కనబడ్డారు.

"మేం కూడా భోజనానికి వచ్చాం." చెప్పారిద్దరూ.

"మీరు కూడా రావడం నాకు సంతోషకరమైన విషయం. కాని ముందు రానన్నారెందుకు?" సందేహంగా అడిగింది ఆవిడ.

"మీరు నన్నో, విజయాన్నో ఆహ్వానించి ఉంటే మిగిలిన ఇద్దరం భోజనానికి నీ ఇంటికి వచ్చే వాళ్ళం కాదు. ప్రేమ ఎక్కడకి వెళితే మిగిలిన ఇద్దరం అక్కడికి వెళతాం." చెప్పాడు ఐశ్వర్యాధి దేవత.

"ఎక్కడ ప్రేమ ఉంటే అక్కడ ఐశ్వర్యం, విజయం ఉంటాయి." చెప్పాడు విజయాధి దేవత.

## 65. మనసు శుభ్రం

పేకాట, మద్యం, సిగరెట్, మగువ లాంటి భౌతికమైన అలవాట్లతో పాటు, అసూయ, గర్వం, ఇతరులని ఎద్దేవా చేయడం లాంటి మానసిక దురలవాట్లు కూడా ఉన్న సుకుమార్‌కి అనుకోకుండా రైలులో ఓ సన్యాసి తారసపడ్డాడు. ఆయన మొహంలోని ప్రశాంతతని, వర్చస్సుని చూసిన సుకుమార్‌కి తన మొహం కూడా అలా మారితే ఎంత బావుంటుంది అనిపించింది. అతనితో మాటలు కలిపాడు. సుకుమార్ ఏదీ దాచకుండా తనకున్న అన్ని అలవాట్లనీ ఆ సన్యాసికి చెప్పాడు.

"ఇవన్నీ చెడ్డవని నాకు తెలుసు. వీటిని వదిలించుకోవాలన్న కోరిక కూడా నాలో ఉంది. కాని అందుకు నాకు సాధ్యం కావడం లేదు."

"అవును. చెడ్డ అలవాట్లున్న ప్రతీ మనిషికీ వాటిని వదిలించుకోవాలన్న కోరిక కూడా అంతర్లీనంగా బలంగానో, బలహీనంగానో ఉంటుంది. ముందుగా ఒక్క అలవాటుని వదిలించుకుంటే చాలు. మిగిలినవన్నీ చకచక వాటంతట అవే వదులుతాయి." చెప్పాడు సన్యాసి.

"అదెలా సాధ్యం? ఎంతో ప్రయత్నం మీద ఒక్క అలవాటుని వదిలించుకోగలమేమో కాని, అన్నిటినీ వదిలించుకోగలగడం కష్టమని నేననుకుంటున్నాను."